క్లుప్తంగా

మళ్లీ జగనే సీఎం కావాలంటున్నారు



కేశవరంలో మళ్లీ నువ్వే జగనన్న కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాస్ తదితరులు

మండపేట: ముఖ్యమంత్రిగా మళ్లీ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్ అన్నారు. మండలంలోని కేశవరంలో శుక్రవారం సాయంత్రం స్థానికులతో కలిసి మళ్లీ నువ్వే జగనన్న కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ ఇటువంటి సంక్షేమ పాలన చూడలేదని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఎంపీటీసీ సభ్యుడు చంద్రమళ్ల పోతురాజు, వైఎస్సార్ సీపీ నాయకులు మన్నె నారాయణమూర్తి, కూసు అబ్బు, మేఘం విష్ణు, కొప్పిరెడ్డి ప్రసాద్, చంద్రమళ్ల రవి శాస్త్రి, గనిశెట్టి సత్తిబాబు, గంధం సూరిబాబు, పలుకూరి వెంకన్న బాబు, బందెల నారాయణరావు, కొల్లి రాజు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుని కుటుంబానికి సాయం



రాముడు కుటుంబీకులకు బియ్యం, నగదు అందజేస్తున్న సచివాలయ సిబ్బంది

కాజులూరు: గొల్లపాలెంలో ఇటీవల వడదెబ్బకు మృతి చెందిన పారిశుధ్య కార్మికుడు కావూరి రాంబాబు (రాముడు) కుటుంబీకులకు గ్రామ సచివాలయ సిబ్బంది ఆర్థిక సహకారం అందజేశారు. సచివాలయ కార్యదర్శులు చెల్లుబోయిన వేణుగోపాలరావు, షేక్ జహంగీర్, వీఆర్వో ఈశ్వర్రావులు శుక్రవారం వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి పోతురాజు బాబురావు, పాలకవర్గ సభ్యులు రేఖపల్లి సత్తిబాబు, మాత నాగరాజు తదితరులతో కలసివెళ్లి మృతుని కుటుంబీకులను పరామర్శించి బస్తా బియ్యం, రూ.10 వేల నగదు అందజేశారు.

నారాయణలంకలో కంటి పరీక్షలు



నారాయణలంకలో కంటి పరీక్ష చేస్తున్న కోటేశ్వరరావు

కపిలేశ్వరపురం: స్థానిక గ్రామ శివారు నారాయణలంకలో డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు పథకంలో భాగంగా శుక్రవారం ఉచితంగా కంటి పరీక్షలు చేశారు. పారా మెడికల్ ఆప్తాలమిక్ ఆఫీసర్ డి.కోటేశ్వరరావు వృద్ధుల కళ్లను పరీక్షించి అవసరమైన వారికి మెరుగైన పరీక్షలకు నివేదించారు. అవసరమైన వారికి ప్రభుత్వం ఉచితంగా కళ్లజోళ్లను పంపిణీ చేస్తుందన్నారు.

వైఎస్సార్ ప్రభుత్వంతోనే పట్టణాభివృద్ధి



శంకుస్థాపన చేస్తున్న ప్రసాద్ తదితరులు

మండపేట: వైఎస్సార్ ప్రభుత్వంతోనే పట్టణాభివృద్ధి సాధ్యమని మున్సిపల్ కౌన్సిల్ విప్ పోతంశెట్టి ప్రసాద్ అన్నారు. స్థానిక 30వ వార్డులో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 22 లక్షలతో చేపట్టనున్న వాటర్ పైప్‌లైన్ నిర్మాణ పనులకు శుక్రవారం వార్డు కౌన్సిలర్ మారిశెట్టి సత్యనారాయణ, అర్బన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజుతో కలిసి ప్రసాద్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ దుర్గారాణి పట్టణాభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారన్నారు. త్వరితగతిన పైప్‌లైన్ పనులు పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. పార్టీ నాయకులు కాటా గోవిందు, స్వప్నకుమార్, ఏసురత్నం, రవి పాల్గొన్నారు.

మహానాడును విజయవంతం చేయాలి

మండపేట: ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల సందర్భంగా రాజమహేంద్రవరం రూరల్ మండలం వేమగిరిలో నిర్వహించే టీడీపీ మహానాడును పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శనివారం పార్టీ ప్రతినిధుల సమావేశం, ఆదివారం భారీ బహిరంగ సభ జరుగుతాయన్నారు. నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని విజ్ఞప్తి చేశారు.

సచివాలయాలు.. సేవానిలయాలు

- సత్ఫలితాలు ఇస్తున్న సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు
- గ్రామ స్థాయిలోనే సమస్యల పరిష్కారం
- సంతోషం వ్యక్తం చేస్తున్న ప్రజలు
- క్లస్టర్ పరిధిలో 155 సచివాలయాలు, 3,012 మంది వలంటీర్లు



గ్రామాల్లో ప్రజలకు సేవలందిస్తున్న సచివాలయం

రాయవరం: గతంలో ఏ సర్టిఫికెట్ కావాలన్నా..ఏ సమస్య వచ్చినా మండల కేంద్రానికి పరుగులు తీసే పరిస్థితి ఉండేది. రెవెన్యూ, ఎంపీడీవో, వ్యవసాయ శాఖల కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితులు ఉండేవి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక గ్రామాల్లో ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు అందుబాటులోకి వచ్చాయి. సచివాలయ వ్యవస్థ, వలంటీర్ వ్యవస్థల ద్వారా ప్రజల ఇళ్ల వద్దకే సంక్షేమ పథకాలు చేరుతుండడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామాలు కేంద్రంగా

గతంలో మండల కేంద్రంగా ప్రజలకు సేవలందించేవారు. పౌర సేవలు ప్రజలకు సులభంగా అందాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థల పట్ల అన్ని వర్గాల ప్రజల నుంచి ప్రశంసలు అందుతున్నాయి. పాదయాత్ర సమయంలో ప్రభుత్వ పథకాలు అందాలంటే పేదలు పడుతున్న ఇబ్బందులు, వారి స్థితిగతులను నాటి ప్రతిపక్ష నేతగా ఉన్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కళ్లారా చూశారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల వల్ల ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులను చూసి చలించి పోయారు. దీంతో అప్పుడే ప్రజలకు గ్రామాల్లోనే ప్రభుత్వ సేవలు అందించాలన్న ఆలోచన మొదలైంది. లోకల్ గవర్నెన్స్ పేరుతో ప్రజల ఇళ్ల ముంగిటకే సంక్షేమ పథకాలు వచ్చి చేరుతున్నాయి.

మండలం	గ్రామాలు	సచివాలయాలు	వలంటీర్లు
రాయవరం	12	19	406
మండపేట	12	23	505
మండపేట అర్బన్	14	14	264
కపిలేశ్వరపురం	19	20	309
కె.గంగవరం	26	23	397
రామచంద్రపురం	25	21	476
ఆర్‌సీపీఎం అర్బన్	12	12	203
కాజులూరు	26	23	452

కోడి కూసే జాముకే పింఛన్లు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. లక్షలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించారు. అంతేగాకుండా మండల కేంద్రాలకు పరుగులు తీసే ప్రజలకు ఇబ్బంది లేకుండా గ్రామాల్లోనే వారి సమస్యలను గుర్తించి పరిష్కరిస్తున్నారు.

క్లస్టర్ పరిధిలో

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధిలో మండపేట, రామచంద్రపురం మున్సిపాలిటీలతో పాటుగా రాయవరం, మండపేట, కపిలేశ్వరపురం, రామచంద్రపురం, కె.గంగవరం మండలాలు ఉన్నాయి. రామచంద్రపురం, మండపేట పురపాలక సంఘాల్లో 26 వార్డులు, ఐదు మండలాల పరిధిలో 120 గ్రామాలున్నాయి. రెండు మున్సిపాలిటీలు, ఐదు గ్రామాల్లో 155 సచివాలయాలున్నాయి. ఈ సచివాలయాల పరిధిలో 3,012 మంది వలంటీర్లు ఉన్నారు. సచివాలయాల పరిధిలోని మహిళలు, రైతులు, విద్యార్థులు, ఇతర వర్గాలకు అన్ని రకాల ప్రభుత్వ సేవలు అందుతున్నాయి. అర్హత ఉంటే చాలు సంక్షేమ పథకం ఇంటి వద్దకే అందిస్తుండడంతో సచివాలయాలపై ప్రజలకు నమ్మకం ఏర్పడింది. దీనికితోడు ఒకటో తేదీ రాగానే కోడి కూసే వేళనే వృద్ధులు, వితంతువులు, ఇతర ప్రాధాన్యత రంగాల వారికి పింఛన్లు అందుతున్నాయి.

రెండు రోజుల్లోనే



వైఎస్సార్ చేయూత పథకానికి గ్రామంలో సచివాలయ వ్యవస్థ ద్వారా దరఖాస్తు చేసుకున్నాను. రెండు రోజుల్లోనే రూ.18,750 రుణం అందజేశారు. దానితో పాడి ఆవును కొనుగోలు చేసి, జీవనాధారం ఏర్పాటు చేసుకున్నాను. గతంలో ఎన్నడూ లేని విధంగా గ్రామంలోనే అన్ని రకాల ప్రభుత్వ సేవలు మాకు అందుతున్నాయి.

– కర్రి లక్ష్మి, లబ్ధిదారు, వి.సావరం, రాయవరం మండలం

ఇళ్ల వద్దకే సంక్షేమ పథకాలు



గ్రామాల్లో ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ ద్వారా మెరుగైన సేవలు అందుతున్నాయి. లబ్ధిదారులు గ్రామం దాటి వెళ్లనవసరం లేకుండానే ప్రతి పని సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా చేరవవుతున్నాయి. ప్రజలు పూర్తి స్థాయిలో సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

– ఎ.శాంతి, డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి, రామచంద్రపురం

మంత్రి వేణును కలిసిన కాకినాడ డీపీఆర్వో



మంత్రి వేణుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న డీపీఆర్వో నాగార్జున

రామచంద్రపురం: కాకినాడ జిల్లా నూతన సమాచార పౌరసంబంధాల అధికారిగా బాధ్యతలు స్వీకరించిన డి.నాగార్జున రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణను శుక్రవారం ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం మంత్రి వేణుతో కొద్ది సేపు మాట్లాడారు.

అభయ ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెంకటాయపాలెం శివారు రామనర్సుతోట గ్రామంలో వేంచేసియున్న శ్రీ అభయ ఆంజనేయస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గణపతి పూజ, పంచామృత అభిషేకాలు, తమలపాకు పూజ, సిందూరం పూజలు నిర్వహించారు. పామర్రుకు చెందిన శ్రీసాయి మహిళా భక్తి సంఘం ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా, లలితా పారాయణ చేశారు. చెల్లూరుకు చెందిన శ్రీ సీతారామాంజనేయ భజన బృందం ఆధ్వర్యంలో కోలాటం నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి పల్లకీలో గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ నిర్మాణకర్తలు అనుసూరి వెంకటరమణారావు, లక్ష్మీరమణమ్మ దంపతులు, గ్రామ సర్పంచ్ యల్లమిల్లి సతీష్‌కుమారి, రవికుమార్ దంపతులు పాల్గొన్నారు.

గ్రామాల్లో జగనన్న పాలవెల్లువ ప్రారంభం



హసన్‌బాద గ్రామంలో సర్వే నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శి భాస్కరలక్ష్మి



వడ్లమూరులో జగనన్న పాలవెల్లువ పథకంపై మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణారెడ్డి

రామచంద్రపురం రూరల్: రాష్ట్రంలో మహిళా రైతుల జీవితాల్లో ఆర్థిక భరోసా పెంచే విధంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న పాలవెల్లువ పథకం కోసం మండలంలోని గ్రామాల్లో శుక్రవారం సర్వేను ప్రారంభించారు. పశు పోషణ చేస్తున్న మహిళా రైతులను గుర్తించి వారికి ప్రభుత్వం అండగా నిలవనుంది. ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో వలంటీర్లు పశు పోషకులను గుర్తించి వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు.

అవగాహన సదస్సులు

కపిలేశ్వరపురం: జగనన్న పాలవెల్లువ పథకంపై శుక్రవారం మండలంలోని వడ్లమూరు, అంగర గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. పాడి పరిశ్రమాభివృద్ధి శాఖ అనుబంధ శాఖల అధికారులు, ఉద్యోగులు, గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు, మహిళా పాడి రైతులు హాజరై పాలసేకరణ కేంద్రాల ఏర్పాటుపై చర్చించారు. ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, తహసీల్దార్ కొమరం సూర్యారావు మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన జగనన్న పాలవెల్లువ పథకం రానున్న రోజుల్లో గ్రామాల్లో పాడి పరిశ్రమాభివృద్ధికి దోహదపడుతుందన్నారు.

క్షేత్రస్థాయిలో అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- ఏడిదలో గడప గడపకూ..



మహిళలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో క్షేత్రస్థాయిలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మునుపెన్నడూ లేని విధంగా ప్రతి ఇంటికీ ప్రభుత్వ లబ్ధి చేకూరుతోందని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం ఆయన ఏడిద గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు.ఆ పంచాయతీ సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం అధ్యక్షతన పార్టీ జగ్గంపేట నియోజకవర్గ పరిశీలకుడు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, జెడ్పీటీసీ సభ్యురాలు కుడిపూడి భవాని తదితరులతో కలిసి ఎమ్మెల్సీ తోట ఏడిద గ్రామంలోని వై.సీతానగరం రోడ్డులో పర్యటించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. మూడేళ్ల పాలనలో ప్రభుత్వం ద్వారా వారికి చేకూరిన లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్లు అందజేశారు. స్థానికులు ఆయన దృష్టికి తెచ్చిన సమస్యలను అక్కడికక్కడే ఎంపీడీఓ ఐ.రాజు, ఈఓ వుండమట్ల వీర్రాజులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో భాగంగా తమ ఇంటికి విచ్చేసిన ఎమ్మెల్సీ తోటకు స్థానికులు ఘనంగా స్వాగతం పలికారు.సొంతింటి కల సాకారమయ్యిందని కొందరు, పింఛన్ వెతలు తీరాయని వృద్ధులు, తమకు చేకూరిన లబ్ధిని వివరిస్తూ స్థానికులు హర్షం వెలి బుచ్చారు. అనంతరం ఎమ్మెల్సీ తోట మీడియాతో మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారని, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఎక్కడికక్కడ లభిస్తున్న ప్రజాదరణ అందుకు నిదర్శనమన్నారు. వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు, సొసైటీ చైర్మన్ రామిశెట్టి శ్రీహరిబాబు, ఆర్‌బీకే మండల కమిటీ డైరెక్టర్ చిలుకూరి బుజ్జి, గ్రామ కమిటీ అధ్యక్షుడు పలివెల సుధాకర్, వై.సీతానగరం సర్పంచ్ వరదా చక్రవర్తి, పార్టీ నాయకులు కుడిపూడి రాంబాబు, వల్లూరి రామకృష్ణ, చంద్రమళ్ల బులివీరయ్య, బేతా వెంకటేశ్వరరావు, పరమట శివ, వీరబాబు, మండారు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధం పాటించాలి



స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్ సామగ్రితో చైర్‌పర్సన్ శ్రీదేవి, కమిషనర్, సిబ్బంది

రామచంద్రపురం: ప్రభుత్వ ఆదేశాల మేరకు పురపాలక సంఘ పరిధిలో ప్లాస్టిక్ నిషేధం అమలులో ఉందని పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ టి.శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. పట్టణంలో శుక్రవారం తెల్లవారుజామున జరిపిన దాడుల్లో పట్టణంలోని వివిధ షాపుల వద్ద సుమారుగా 80 కేజీల ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులను స్వాధీనం చేసుకుని సీజ్ చేశామని చెప్పారు. గతంలో ప్లాస్టిక్ నిషేధంపై హోల్‌సేల్, రిటైల్ షాపుల యజమానులకు అవగాహన కల్పించామని అన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై బ్యాన్ విషయాన్ని తెలియజేశామని అతిక్రమించిన వారి నుంచి అపరాధ రుసుములు వసూలు చేశామన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి మాట్లాడుతూ పట్టణంలోని ప్రజలందరూ ప్లాస్టిక్ రహిత రామచంద్రపురం ఏర్పాటు దిశగా సహకరించాలని కోరారు. మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ డేవిడ్‌రాజు, మున్సిపాలిటీ సిబ్బంది, సచివాలయ శానిటేషన్, ఎన్విరాన్మెంట్ సెక్రటరీలు పాల్గొన్నారు.

స్వచ్ఛ గ్రామాలకు కృషి



మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని జగనన్న ఇళ్ల నిర్మాణాల ప్రగతిపై మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం హౌసింగ్ శాఖ ఆధ్వర్యంలో సమీక్షా కార్యక్రమం నిర్వహించారు. హౌసింగ్ ఇన్‌చార్జి ఈఈ కె.మల్లికార్జున్ నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలను ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ అధికారులకు సూచించారు. గ్రామాల్లో ప్లాస్టిక్ వాడకాన్ని అరికడదామని, శక్తి వనరులను పొదుపుగా వాడుతూ, ఎలక్ట్రానిక్ వ్యర్థాలను తగ్గించుకుంటూ స్వచ్ఛ గ్రామాలకు కృషి చేద్దామని సమావేశంలో పాల్గొన్న వారందరితో ప్రతిజ్ఞ చేయించారు. డీఎల్‌డీఓ ఎ.శాంతి, మండల ప్రత్యేక అధికారి డి.రాజు, ఎంపీడీఓ ఎన్.షెలత్‌రాజు, హౌసింగ్ ఏఈలు కేవీ భాస్కరరావు, లంక సత్యనారాయణ, మండలంలోని ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మద్యం మత్తులో ఘర్షణ

అమలాపురం టౌన్: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా మెయిన్ రోడ్డు చెంతన ఓ బార్ అండ్ రెస్టారెంట్ వద్ద ఇద్దరు మద్యం మత్తులో గురువారం రాత్రి ఘర్షణకు దిగారు. ఈ గలాటాలో ఇద్దరికీ గాయాలయ్యాయి. గాయపడిన వీరిని వారి సంబంధీకులు ఆస్పత్రులకు తరలించి వైద్యం అందించారు. కాకినాడ, రాజమహేంద్రవరంలోని చెరో కార్పొరేట్ ఆస్పత్రులకు వెళ్లి వారు వైద్యం పొందినట్లు తెలిసింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. గాయపడిన ఇద్దరి నుంచి పోలీసులకు శుక్రవారం కూడా ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

వేసవి దుక్కు.. లాభాలు పెక్కు

- దమ్ములకు ప్రాధాన్యమివ్వాలంటున్న అధికారులు
- ఇదే సరైన తరుణమని సూచన



కాజులూరులో ట్రాక్టర్‌తో వేసవి దుక్కు దున్నుతున్న రైతు

కాజులూరు: రబీ పంట మాసూళ్ల అనంతరం వేసవి దుక్కుల (మెట్ట దమ్ముల)కు రైతులు ప్రాధాన్యమివ్వాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుతం డెల్టాలోని దాదాపు అన్ని ప్రాంతాల్లోనూ రైతులు రబీ మాసూళ్ల పనులు పూర్తి చేసుకున్నారు. అక్కడక్కడా కొందరు రైతులు అపరాలు సాగు చేసుకోగా అధిక శాతం రైతులు పొలాలను ఆరగట్టి ఉంచారు. ఈ పొలాల్లో వేసవి దుక్కుల వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు.

వేసవి దుక్కులంటే?

గతంలో వ్యవసాయ రంగంలో యంత్రాలు వాడకం అంతగా లేని సమయంలో రైతులు ఎడ్లకు (పశువులకు) నాగలికట్టి దాళ్వా మాసూళ్లు చేసిన కొన్ని రోజుల తర్వాత వేసవిలో ఒక్కసారి మెట్ట దుక్కు చేసేవారు.

వర్షాలు పడి కాలువనీరు వచ్చిన అనంతరం మరోమారు దుక్కులు దున్నేవారు. ట్రాక్టర్లు అందుబాటులోకి రావటంతో రైతులు పొలాల్లోకి నీరు వచ్చిన తర్వాత వెంటవెంటనే తొలిసాలు, మలిసాలు దమ్ములు నిర్వహిస్తున్నారు. ప్రస్తుత తరుణంలోనూ వేసవి దుక్కులు మేలైనవని, నారుమడులు వేసి పొలాల్లో దమ్ములు చేసేందుకు ఇంకా సమయం ఉన్నందున రైతులు తమ పొలాల్లో వేసవి దుక్కులు చేపట్టాలని అధికారులు చెబుతున్నారు.

ఉపయోగాలు ఎన్నో



వేసవి దుక్కులతో కలుపు, కేళీలు నిర్మూలించవచ్చు. భూసారం వృద్ధి చెందుతుంది. ట్రాక్టరుకి నాగలిశెట్టు కట్టి ఆరు అంగుళాల నుంచి అడుగు లోతు వరకూ దుక్కు దున్నటం ద్వారా పొలంలోని మట్టి తిరగబడుతుంది. దీంతో దాళ్వా వరి పంట నుంచి భూమిలోకి చేరిన క్రిమికీటకాలు, పురుగుల గుడ్లు బయటకు వచ్చి ఎండవేడికి నశించిపోతాయి. దాళ్వా మాసూళ్ల అనంతరం పొలంలో ఉండిపోయిన గడ్డి మట్టిలో కలిసి చీకిపోయి సేంద్రియ ఎరువులా మారుతుంది.

– వి.అశోక్, మండల వ్యవసాయాధికారి

సీఎం జగన్‌తో సొంతింటి కల సాకారం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

అల్లవరం: పేదల సొంతింటి కలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేస్తున్నారని ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ అన్నారు. అమరావతి ప్రాంతంలో పెద్ద పండుగలా 51 వేల లబ్ధిదారులకు పట్టాల పంపిణీ కార్యక్రమం చేపట్టడం సీఎం జగన్ కార్యదీక్షకు నిదర్శనమన్నారు. అమరావతిలో పట్టాల పంపిణీ కార్యక్రమానికి ఇచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎమ్మెల్సీ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఇంతటి బృహత్తర కార్యక్రమం నిర్వహించిన సీఎం జగన్‌కు ఇజ్రాయిల్ అభినందనలు తెలిపారు. పట్టాల పంపిణీ కార్యక్రమంలో లబ్ధిదారుల ముఖాల్లో ఆనందం చూశామని, వారి ఆనందానికి అవధులు లేవని తెలిపారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం దేశ చరిత్రలో సువర్ణాధ్యాయంగా నిలుస్తుందని కొనియాడారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి



ప్రమాదాలకు నిలయంగా ఉన్న మలుపు

కె.గంగవరం: మండలంలోని తామరపల్లి గ్రామంలో ప్రారంభంలో గల మలుపు ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈ రహదారిలో పక్కపక్కనే రెండు ప్రమాదకర మలుపులు ఉండడం, పక్కనే చెరువు ఉండడం వల్ల స్పీడుగా వచ్చే ప్రయాణికులు గాయాల పాలవుతున్నారని స్థానికులు అంటున్నారు. ఈ రహదారి నిర్మించినప్పటి నుంచి అధికారులకు స్పీడు బ్రేకర్లు వేయాలని కోరుతున్నామని గ్రామస్తులు అంటున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

స్పోకెన్ ఇంగ్లిష్ తరగతుల ప్రారంభం

అమలాపురం రూరల్: ఏపీ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం జిల్లా శాఖ, పేరూరు అంబేడ్కర్ యువజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పేరూరు తాడిగుంట మెరక కమ్యూనిటీ హాల్‌లో స్పోకెన్ ఇంగ్లిష్ ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించారు. వీటిని సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బత్తుల నకులరాజు, గోసంగి బంగార్రాజు, స్థానిక అంబేడ్కర్ యువజన సంక్షేమ సంఘం అధ్యక్షుడు జల్లి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏడాది వేసవి సెలవుల్లో విద్యార్థులు ఆంగ్ల భాషపై పట్టు సాధించేందుకు ప్రయత్నిస్తున్నామని అన్నారు. ఆంగ్లంపై భయాన్ని తొలగించే దిశగా ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం కృషి చేస్తుందని అన్నారు. జిల్లా ఆర్థిక కార్యదర్శి సాధనాల సత్యనారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి గెడ్డం ప్రదీప్, మాజీ ఎంపీటీసీ ముత్తాబత్తుల వీరవెంకట సత్యనారాయణ, జల్లి శేఖర్, ముత్తాబత్తుల ఆనందరావు, నాగాబత్తుల భానోజీరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తులు

యానాం: స్థానిక టంగుటూరి ప్రకాశం పంతులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు శుక్రవారం వైస్ ప్రిన్సిపాల్ వి.చిత్ర ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు దరఖాస్తుతో పాటు పదోతరగతి పాస్ మార్కుల లిస్టు, టీసీ, బ్యాంక్ పాస్ బుక్, రెసిడెన్స్ సర్టిఫికెట్, ఆధార్, కుల ధ్రువీకరణ పత్రం తదితర జిరాక్సులు జత చేయాలన్నారు. దరఖాస్తులు కళాశాలలో అందుబాటులో ఉన్నాయని, పూర్తి చేశాక వచ్చే నెల 9వ తేదీలోగా కళాశాలలో సమర్పించాలని కోరారు.